RNI:TS-28-0030298

# తెలంగాణ డైలి న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com | సంపుటి : 01 సంచిక : 204 | ఆదివారం, ఆగస్టు 02, 2026, | పేజీలు - 06 | వెల : 3/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలాల రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

## అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల

# నిరోధానికి చట్టం తెస్తాం



**హైదరాబాద్, ఆగస్టు 1 :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం ఈరోజు(శనివారం) జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## తెలంగాణ రైజింగ్.

# కొత్త శిఖరాలకు రాష్ట్రం

- పెట్టుబడులు, ఉపాధితో వేగంగా అభివృద్ధి..
- పెట్టుబడులకు రెట్టింపు ఆదాయం వస్తుందని రేవంత్ రెడ్డి భరోసా
- పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇస్తున్నామన్న ముఖ్యమంత్రి
- రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదన్న సీఎం



**హైదరాబాద్, ఆగస్టు 1:** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం సంబంధిత స్క్రీన్ షాట్‌ను ఎక్స్‌లో షేర్ చేశారాయన. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్ర విజన్‌కు శుభదినం



**భోగాపురం:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, స్వర్ణాంధ్ర విజన్ సాకారానికి ఇవాళ అత్యంత కీలకమైన రోజు అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంతో పాటు రాష్ట్రంలో మొత్తంగా రూ. 18 వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన ప్రకటించారు. ఉత్తరాంధ్ర యువత ప్రగతికి ఈ సరికొత్త ఎయిర్ పోర్టు ఒక రన్‌వేలా, లాంచ్ ప్యాడ్‌లా పని చేస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్రతో పాటు వికసిత్ భారత్ సంకల్పాన్ని నెరవేర్చే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజిన్ సర్కార్ రాత్రింబ వళ్లు శ్రమిస్తోందని వెల్లడించారు. ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవాలను స్మరిస్తూ ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోదీ, గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేలపై ఆయన పేరుతోనే ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కేవలం ఒకే కుటుంబం పేర్లు ఎయిర్ పోర్టులకు పెట్టే పద్ధతిని మార్చి, దేశ సంస్కృతిని గౌరవిస్తూ అయోధ్యలో వాల్మీకి పేరు, ఇక్కడ అల్లూరి పేరు పెట్టామని గుర్తు చేశారు. దేశంలో గతంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్యను 166కు పెంచడం ద్వారా చిన్న చిన్న విమానయాన సేవలను విస్తరించామన్నారు.

## ఏ యాక్టర్ల ఫోన్లు ట్యాప్

# కాలేదన్నారు.



**హైదరాబాద్ :** సోషల్ మీడియా ద్వారా ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మీడియాలో, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వస్తే అవును తప్పకుండా (ఫ్యాక్ట్ చెక్) నిజాలను నిర్ధారించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం--ప్రజాస్వామ్యం--పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రగతి భవన్‌లో కేసీఆర్ క్యాంప్ ఆఫీస్ పెడితే 150 బెడ్‌రూమ్‌లున్నాయని ప్రచారం చేశారు..మరి ఇప్పుడక్కడ ఎవరుంటు న్నారు..? ఉన్నాయా 150 బెడ్‌రూమ్‌లు. అందులో బంగారు కప్‌బోర్డులున్నాయన్నారు. ఆ ఫేక్ న్యూస్ వ్యాపింపచేసింది ఎవరు.. రూ.84 వేల కోట్ల ఖర్చయిన కాళేశ్వరం ప్రాజెక్టును రూ.లక్ష కోట్ల కుంభకోణమని ప్రచారం చేశారు. అది ఫేక్ న్యూస్ కాదా..? ఇవన్నీ కూడా ఖచ్చితంగా ప్రశ్నించాలన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఎవరో సినిమా యాక్టర్ల ఫోన్లు మీడియాను అడ్డం పెట్టుకుని ట్యాప్ చేశామని ప్రచారం చేశారు.. ఫోన్ ట్యాపింగ్‌లో నన్ను విచారణకు పిలిస్తే పోయాను.

## కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు


# బిగ్ అలర్ట్




**హైదరాబాద్ :** రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్‌దరఖాస్తుల స్వీకరణ తేదీలను తెలంగాణ పోలీస్ నియామక మండలి ప్రకటించింది. ఆగస్టు 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. దరఖాస్తులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే స్వీకరిస్తు న్నట్లు వెల్లడించింది. ఎస్సై పోస్టులకు రూ.750 (ఎస్సీ/ ఎస్టీ), రూ.1,500 ఇతరులకు ఫీజు ఉంటుందని తెలంగాణ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు పేర్కొంది. 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ : తెలంగాణ రాష్ట్రంలో 7,437 కొలువుల భర్తీకి టీఎస్ఎల్‌పీఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. పోలీస్, ఫైర్, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) శాఖలకు సంబంధించి వేర్వేరుగా 4 నోటిఫికేషన్లు వెలువరించింది. వీటిలో సబ్ ఇన్‌స్పెక్టర్, ఏఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు మొత్తంగా 7 వేలకు పైగా పోలీసు కొలువులు ఉన్నాయి. అప్లికేషన్? ప్రొఫార్మాను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు పోలీస్ ఉద్యోగాల నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాస రావు ఇటీవలే వెల్లడించారు. అభ్యర్థులు పీఎంటీ, పీఈటీ ప్రమాణాలు సరిగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే పరీక్షలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

## ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికింది

# ఇకపై దశ, దిశ మారతాయి



**భోగాపురం:** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలుగెత్తి చాటారు. భోగాపురం ఎయిర్ పోర్టును ప్రధాని మోదీ జాతికి అంకితం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనం ఈ ఎయిర్‌పోర్టు అని అన్నారు. భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. కర్షకులు కేవలం భూములు ఇవ్వలేదని, ఈ ప్రాంతానికి ఓ బంగారు భవిష్యత్తును ఇచ్చారని ఆయన కొనియాడారు. ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు ఓ మణిహారమని, దీని ద్వారా ఈ ప్రాంత ప్రజల కలలకు రెక్కలు వచ్చాయన్నారు. నాడు మనమే మనమే: ఒకప్పుడు ఇక్కడికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసి, ప్రజల ఆశలను తక్కువ చేసి మాట్లాడిన వారు నేడు ఇక్కడికి 'ఎయిర్‌బస్సు' రావడంతో అడ్రస్ లేకుండా పోయారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును ఈ ఎయిర్‌పోర్టుకు పెట్టుకోవడం ద్వారా గుండె ఉప్పొంగుతోందని సీఎం అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మారే ఈ ఎయిర్‌పోర్టు నిర్మించారని, విమానాశ్రయానికి తొలి అడుగు వేసిన అశోక్‌గజపతిరాజు, నిర్మాణం పూర్తిచేసే బాధ్యత తీసుకున్న రామ్మోహన్ ఇక్కడి వారే కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. 'భోగాపురం ఎయిర్‌పోర్టుకు నాడులో 2019లో కొబ్బరికాయ కొట్టింది మనమే, నేడు గుమ్మడికాయ కొట్టింది మనమే' అని గుర్తు చేశారు.

## 3రోజుల గురుపౌర్ణమి ఉత్సవాల్లో


# రూ.7 కోట్ల విరాళాలు




**శిర్డీ:** శిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ నిర్వహించిన శ్రీ గురు పౌర్ణమి ఉత్సవాలకు ఈ ఏడాది కూడా దేశ, విదేశాల నుంచి సాయి భక్తుల నుంచి అఖండ స్పందన లభించింది. సాయిబాబాను తమ గురువుగా భావించే లక్షలాది భక్తులు సాయి పాదాలకు నమస్కరించి, గురుదక్షిణగా ఉదారంగా విరాళాలు సమర్పించారు. గురు పౌర్ణమి ఉత్సవాల కేవలం మూడు రోజుల్లోనే, సంస్థకు రూ. 7,81,13,000 విరాళాలు అందాయి. గత ఏడాది రికార్డును ఈ ఏడాది అధిగమించడంతో పాటు 1.5 కోట్ల రూపాయల పెరుగుదల నమోదైందని సంస్థాన్ ముఖ్య కార్య నిర్వహణాధికారి గోరక్ష గదిల్కర్ తెలిపారు.

## 144 కోట్ల ప్రజల ఆకాంక్షలను మోస్తున్న ఏకైక నాయకుడు ప్రధాని మోదీ:

### తనను దూషించినవారిని కూడా క్షమించే గుణం ప్రధాని మోదీది



**భోగాపురం:** ఈ నేల బానిసగా ఉండదు, ఈ జాతి ఎవరికీ తలవంచదు' అని బ్రిటిష్ సామ్రాజ్యానికి సవాల్ విసిరిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరా జు పేరును భోగాపురం విమానాశ్రయానికి పెట్టడం ఎంతో స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అల్లూరి స్ఫూర్తి నేటి నుంచి రెక్కల మీద ప్రపంచం నలుమూలలకూ చేరుకుంటుందన్నారు. ఈ విమానాశ్రయ ప్రారంభం ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయమని ఆయన అభివర్ణించారు. ఏ దేశమైనా కేవలం ప్రకటనలతో అభివృద్ధి చెందదని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుం దన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ జాతికి అంకితం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. చరిత్ర కూడా కేవలం మనం నిర్మించిన కట్టడాలను మాత్రమే గుర్తుంచుకోదని, ఆ కట్టడాల ద్వారా నిర్మితమైన భవిష్యత్తును బట్టి గుర్తుంచు కుంటుందని ఆయన విశ్లేషించారు. విశాఖలో లక్షల కోట్ల పెట్టుబడులతో వస్తున్న ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నాయని, ఇవి ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించి ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తాయని పవన్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా అవతరిస్తోందని, ఈ ఎయిర్‌పోర్టు ను జీఎంఆర్ సంస్థ నిర్మించడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించే ఒక గొప్ప నిర్ణయమని కొనియాడారు.

# శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ శుభ్రతకు కేర్ టేకర్ నియామకం

- ఆలయాభివృద్ధికి కృషి చేస్తాం గ్రామ సర్పంచ్ హన్మయ్య



**పరిగి, ఆగస్టు 2 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా ఆలయాన్ని శుభ్రం చేయడానికి ఎవరూ లేకపోవడంతో, స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ అన్నమయ్య, ఉపసర్పంచ్ రాధా మల్లేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు కలిసి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకు న్నారు. ఆలయాన్ని క్రమం తప్పకుండా శుభ్రం చేసేందుకు ముందుకు వచ్చే వారికి గ్రామ పంచాయతీ తరపున ఏటా ?8,000 పారితోషికం అందిస్తామని ప్రకటించారు. దీనికి స్పందించిన గ్రామానికి చెందిన బోయిని రాములు అనే వ్యక్తి ఆలయ పారిశుధ్య బాధ్యతలు చేపట్టేందుకు ముందుకు రాగా, నాయకులు ఆయనను ఆలయ కేర్ టేకర్ (పరిశుభ్రత నిర్వాహకుడిగా) నియమించారు. సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆలయాలు మన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు ప్రతీకలు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత. రాబోయే రోజుల్లో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధికి, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తాం. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాధా మల్లేష్, వార్డు మెంబర్లు నరేష్,మల్లేష్, కృష్ణయ్య బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకటయ్య సీనియర్ నాయకులు నారాయణ కానిస్టేబుల్ వెంకటయ్య, భక్తులు సాక్షి మహేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుడిపై సర్పంచ్ భర్త జులుం



- పేరుకు మాత్రమే భార్య సర్పంచ్ పెత్తనంతా భర్తదే..
- పనిలోకి రావద్దంటూ దళిత కార్మికుడికి హుకుం..
- రెండు నెలలుగా నిలిపివేసిన కార్మికుడి జీతం..
- సొంత డబ్బుతో ట్రాక్టర్ రిపేరు చేయించాలని బెదిరింపులు..
- పూడూరు మండలం తుర్క ఎన్కేపల్లిలో ఘటన

**పూడూరు, ఆగస్టు 2 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** రెక్కాడితే గానీ డొక్కాడని గ్రామీణ పంచాయతీ కార్మికుడిపై ఒక సర్పంచ్ భర్త ప్రదర్శిస్తున్న నిరంకుశ వైఖరి తీవ్ర కలకలం రేపుతోంది. గ్రామానికి రాత్రింబవళ్లు సేవలు అందిస్తున్న కార్మికుడి పట్ల వివక్ష చూపుతూ, నయానో భయానో లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చాలీ చాలని జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్న ఓ దళిత కార్మికుడిని పనిలో నుంచి తీసేశానంటూ బెదిరింపులకు దిగడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నా యి. ప్రమాద వశాత్తు జరిగిన ఈ సంఘటనను ఆసరాగా చేసుకుని సర్పంచ్ భర్త తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు దిగాడు. నీ సొంత డబ్బులు పెట్టి ట్రాక్టర్ రిపేరు చేయిస్తేనే పనిలోకి రా, లేకపోతే రాకు నిన్ను పనిలో నుంచి తీసేస్తున్నా అంటూ సర్పంచ్ భర్త వెంకటేష్ హుకుం జారీ చేయడం గమనార్హం. వికారాబాద్ జిల్లా, పూడూరు మండలం, తుర్క ఎన్కేపల్లి గ్రామపంచా యతీలో గ్రామం దళిత కుటుంబానికి చెందిన బాధితుడు బుర్రగంజి నర్సింలు, సుమారు గత 9 సంవత్సరాలుగా నమ్మకమైన కార్మికుడిగా సేవలందిస్తున్నా డు. జూలై 4వ తేదీ సాయంత్రం గ్రామపంచాయతీ పని నిమిత్తం నర్సింలు ట్రాక్టర్ తీసుకుని వెళ్తుండగా, అనుకోకుండా అదుపుతప్పి గ్రామంలోని మోరీ లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ కుడివైపు టైరు డెక్స్ బెండ్ అయింది. ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనను ఆసరాగా చేసుకుని ట్రాక్టర్ రిపేరు చేయిస్తేనే పనిలోకి రా, లేకపోతే రాకు అంటూ కార్మికుడు నర్సింలు పై సర్పంచ్ భర్త వెంకటేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు దిగినట్టు బాధితుడు ఆరోపించాడు.

**తెరవెనుక చక్రం తిప్పుతున్న భర్త..**

రాజ్యాధికారంలో మహిళలకు రిజర్వేషన్లు వచ్చి, చట్టాలు మారినా.. క్షేత్రస్థాయిలో ఇంకా పితృస్వామ్య భావజాలం మారలేదనడానికి తుర్క ఎన్కేపల్లి పంచాయతీ ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఇక్కడ పేరుకే భార్య సర్పంచ్.. అసలు పెత్తనమంతా భర్తదేనంటూ గ్రామస్తులు బహిరంగంగా ఆరోపిసున్నారు. గ్రామంలో ఏ అభివృద్ధి పని జరగాలన్నా, చివరికి చిన్న చిన్న పంచాయతీ పనులు జరగాలన్నా ఆ భర్తగారి అనుమతి లేనిదే అడుగు ముందుకు పడట్లేదని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామపంచాయతీలో పెత్తనం అంత భర్త, దే భార్య సర్పంచ్ అయినా ప్రతి పనికీ నన్నే అడగాలి.. నన్ను అడగకుండా ఏ పని చేయకూడదు గ్రామంలో కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోయిన సరే నన్ను అడగకుండా ట్రాక్టర్ బయటికి తీయకూడదు అంటూ మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల ముందే సర్పంచ్ భర్త వెంకటేష్ హుకుం జారీ చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

**జీతం అడిగితే కార్మికుడి పై బెదిరింపులు..**

గత రెండు నెలలుగా జీతం ఇవ్వకుండా సర్పంచ్ భర్త తనపై తీవ్ర వివక్ష చూపుతు న్నాడని బాధితుడు నర్సింలు ఆవేదన వ్యక్తం చేశాడు. రావాల్సిన బకాయి జీతం ఇవ్వాలని అడిగేందుకు వెళ్లిన నర్సింలు కుటుంబ సభ్యులపై కూడా సర్పంచ్ భర్త వెంకటేష్ తీవ్ర స్థాయిలో మండిపడుతూ బెదిరింపులకు పాల్పడినట్లు కుటుంబీకులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ చేయిస్తేనే జీతం డబ్బులు ఇస్తానంటూ కార్మికుడిపై తీవ్ర ఒత్తిడి తెస్తు న్నాడని బాధిత కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశాడు డ్యామేజ్ అయిన డెక్స్ ను చేయిస్తే రెండు నుంచి మూడు వేల వరకు అవుతుంది. కానీ రెండు నెలల జీతం ఇవ్వనంటూ గ్రామస్తుల ముందు గ్రామ పెద్దల ముందు సర్పంచ్ భర్త తెగేసి చెప్తున్నా డంటూ కార్మికుల నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు.

**రూల్స్ పక్కన పెట్టి.. సొంత చట్టాలు**

గ్రామపంచాయతీ పనిపై వెళ్తున్నప్పుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైరు డెక్స్ బెండ్ అయితే, దానికి కార్మికుడిని బాధ్యుడిని చేస్తూ "నీ సొంత డబ్బులతో రిపేరు చేయిస్తేనే రా, లేకపోతే నిన్ను తీసేశా" అని అనడం చట్ట విరుద్ధం. పంచాయతీ వాహనాలకు జరిగే ప్రమాదాలకు పంచాయతీ నిధుల నుంచి రిపేర్లు చేయించాలి కానీ, నెలకు చాలీచాలని జీతం తీసుకునే కార్మికుడిపై ఆ భారాన్ని నెట్టడం సర్పంచ్ భర్త నిరంకుశత్వానికి పరాకాష్ట. ప్రమాద వశాత్తు జరిగిన దానికి సొంత ఖర్చులతో రిపేరు చేయించమనడం ఎంతవరకు కరెక్ట్ అని నిలదీస్తున్నారు.

**9 ఏళ్ల నమ్మకం.. సర్పంచ్ భర్త దౌర్జన్యం..**

సర్పంచ్ భర్త వైఖరిపై తుర్క ఎన్కేపల్లి గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసు న్నారు. నర్సింలు గత ఏడేళ్లుగా కేవలం ట్రాక్టర్ తోలడమే కాకుండా, ఊరిలో ఎలక్ట్రీషియన్ పనులతో పాటు ఎలాంటి పని చెప్పినా ఎంతో నమ్మకంగా, బాధ్యతగా పని చేసేవాడని పంచాయతీ ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఊరంతా నమ్మే కార్మికుడిపై సర్పంచ్ ఈ విధంగా జులుం ప్రదర్శించడం, "పనిలో నుంచి తీసేశాను" అని బాహాటంగా చెప్పడం సర్పంచ్ భర్త కక్షసాధింపు ధోరణికి నిదర్శనమని మండిపడుతున్నారు.


**జిల్లా అధికారులు స్పందించి కార్మికుడు న్యాయం చేయాలి..**

సర్పంచ్ భర్త దౌర్జన్యాన్ని అరికట్టి, తక్షణమే తమకు న్యాయం చేయాలని బాధితుడు నర్సింలుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు వికారాబాద్ జిల్లా అధికారులను వేడుకుంటున్నారు. నిలిపివేసిన రెండు నెలల జీతాన్ని వెంటనే ఇప్పించాలని, సర్పంచ్ భర్త వేధింపుల నుంచి తమకు కల్పించి, నర్సిం లును తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ రాజ్ అధికారులను కోరుతున్నారు.

## యూరియా కావాలంటే నానో కొనాల్సిందేనట

# ఫర్టిలైజర్ ఏజెన్సీల దోపిడీ

- ఫర్టిలైజర్ 'దందాలు' నానో పేరిట రైతుల జేబులకు చిల్లు..
- పరిగి, పూడూరులో వెలుగుచూసిన దౌర్జన్యం
- యాప్‌లో బుక్ చేసుకున్నా ఇవ్వని పరిస్థితి..
- యజమానుల తీరుపై రైతాంగం తీవ్ర ఆగ్రహం




**పరిగి, ఆగస్టు 2 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** సాగు సీజన్ ప్రారంభమైందంటే చాలు.. రైతుకు కష్టాలు మొదలైనట్లే. ఒకవైపు వర్షాల అనుకూలత కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసే అన్నదాతకు, మరోవైపు ఎరువుల కొరత, ఫర్టిలైజర్ ఏజెన్సీల దౌర్జన్యాలు శాపంగా మారుతున్నాయి. యూరియా బస్తా కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబ డటమే కాకుండా, వ్యాపారులు పెడుతున్న అడ్డగోలు నిబంధనలకు బలవుతున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా పరిగి, పూడూరు కుల్కచర్ల, మండలాల్లో ఉన్న కొందరు ఫర్టి లైజర్ షాప్, యజమాన్యలు చేస్తున్న దౌర్జ న్యలు స్థానిక రైతాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. సంఘటన వివరాల్లోకి వెళ్తే.. ?పరిగి పట్టణానికి చెందిన ఓ రైతు తన పొలం అవసరాల నిమిత్తం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అధికారిక ఫర్టిలైజర్ యాప్ ద్వారా 5 యూరియా బస్తాలను బుక్ చేసుకు న్నాడు. యాప్‌లో బుకింగ్ విజయవంతంగా పూర్తయి, శనివారం ఉదయం ఓ ఫర్టిలైజర్ షాప్ కి వెళ్లాడు. తనకు రావాల్సిన 5 యూ రియా బస్తాలను ఇవ్వాలని యజమాన్యాన్ని కోరగా.. అక్కడ షాకింగ్ ఉదంతం ఎదురైంది. "మీకు యూరియా బస్తాలు కావాలంటే.. కచ్చితంగా వీటితో పాటు ఒక నానో యూరియా లేదా నానో డిఏపి,లు కొనాల్సిందే లేదంటే ఇచ్చినా, యాప్‌లో బుక్ చేసినా యూరియా ఇచ్చేది లేదు. అని షాపు యజమాని తెగేసి చెప్పాడు. ఈ అన్యాయమైన వ్యాపారి వైఖరిపై సదరు యువ రైతు తీవ్రంగా స్పందించాడు. నేను యాప్‌లో కేవలం యూరియా బస్తాలను మాత్రమే బుక్ చేసుకున్నాను. నా పంటకు ఏది అవసరమో నాకూ తెలుసు. నాకు అవసరం లేని నానో యూరియా, నానో డీఏపీలను మాపై ఎందుకు రుద్దుతున్నారు. ఇది పక్కా దౌర్జన్యం కాదా.. అని ఏజెన్సీ యజమానులను నిలదీశాడు. అయితే, వ్యాపారులు మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, తీసుకుంటే తీసుకో.. లేదంటే ఇక్కడి నుండి వెళు" అని బెదిరింపు ధోరణి లో మాట్లాడటం గమనార్హం.

**ఫర్టిలైజర్ వ్యాపారులపై మండిపడుతున్న రైతాంగం**

ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది. పరిగి, పూడూరు, కుల్కచర్ల, మండలాల్లో ఉన్న సుమారు అన్ని ఫర్టిలైజర్ షాప్ లలో ఇదే పరిస్థితి నెలకొంది అంటూ రైతులు మండిపడుతున్నారు. తీరుపై స్థానిక రైతులు, రైతు సంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కంపెనీల లాభాల కోసం రైతులను ఇబ్బందులు పెడతారా.. నానో యూరియాను ప్రమోట్ చేసే నెపంతో, వ్యాపారులు తమ కమీషన్ల కోసం రైతులపై అదనపు భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. యాప్ బుకింగ్‌కూ విలువ లేదా.. ప్రభుత్వం పారదర్శకత కోసం యాప్ విధానం తీసుకొస్తే, ఈ ఏజెన్సీలు దాన్ని కూడా బొందపెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పక్క వర్షాభావ పరిస్థితులతో, పెట్టుబడి ఖర్చులు పెరిగి నష్టాల్లో ఉన్న రైతును.. ఇలా 'ట్యాగింగ్' పేరిట దోచుకో వడం దారుణమని ధ్వజమెత్తారు.

**అధికారుల మౌనం.. వ్యాపారులకు వరం.**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులతో పాటు ఎలాంటి ఇతర ఉత్పత్తులను బలవంతంగా విక్రయించకూడదు అలా విక్రయిస్తే సదరు ఫర్టిలైజర్ షాపు లైసెన్స్ రద్దు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ, వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖా ధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి ఏజెన్సీలు రెచ్చిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకదానికొకటి ముడిపెట్టి రైతులను వేధిస్తున్న ఫర్టిలైజర్ షాపులపై వ్యవసాయ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. అడ్డగోలుగా నానో యూరియా, నానో డిఏపి, బస్తాలు, బాటిళ్లను అంట గడుతూ బెదిరింపులకు పాల్పడుతున్న యజమానుల లైసెన్సుల ను వెంటనే రద్దు చేయాలి. లేని పక్షంలో వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఫర్టిలైజర్ షాపుల ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతమని హెచ్చ రించారు. ఎంతో ఆశగా పంటలు సాగు చేసు కుంటున్న అన్నదాతను ఆదుకోవాల్సిన ఏజెన్సీ లు.. రాబందుల్లా మారడం శోచనీయం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖఉ న్నతాధికారులు స్పందించి చట్టపరమైన చర్య లు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని సర్వత్రా విజ్ఞప్తులు వ్యక్తమవు తున్నాయి. యూరియాతో నానోను ముడిపె డితే కఠిన చర్యలు..యూరియా బస్తాలతో పాటు నానో యూరియా లేదా నానో డీఏపీ, లను బలవంతంగా అంటగడుతూ (ట్యాగింగ్ చేస్తూ) రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఫర్టిలైజర్ షాపుల యజమానులపై చట్టప రమైన కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి మండల వ్యవసాయ అధికారి రజిత స్పష్టం చేశారు. ఇటీవల ఓ రైతుకు.. నానో ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని బెదిరించిన ఘటనపై వ్యవసాయ శాఖ స్పందించింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం గానీ, వ్యవసాయ శాఖ గానీ యూరియా బస్తాలతో నానో ఎరువులను కచ్చితంగా కొనాలని ఎలాంటి నిబంధన విధించలేదని తెలిపారు.

**లైసెన్సులు రద్దు చేస్తాం..**

ఎవరైనా ఏజెన్సీలు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి, రైతులకు అవసరం లేని ఉత్పత్తులను బలవంతంగా అంటగడితే సదరు షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి లావణ్య హెచ్చరించారు. ఫర్టిలైజర్ వ్యాపారులు దౌర్జన్యానికి పాల్పడినా, అదనపు ధరలకు అమ్మినా రైతులు వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

రైతులను ఇబ్బందులకు గురిచేసే వ్యాపారులపై తనిఖీలు ముమ్మరం చేస్తామని, ఏజెన్సీలు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారి స్పష్టం చేశారు.

# 13వ వార్డులో పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన

- 13వ వార్డులో ఎస్ఐఆర్ వార్డు సభ..
- ఏఎస్‌డీ, డబుల్ ఓటర్ల జాబితా సవరణకు ఏకగ్రీవ ఆమోదం




**పరిగి, ఆగస్టు 2 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** 13వ వార్డులో పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన. ఓటరు జాబితాల సవరణపై ప్రత్యేక దృష్టి -- అర్హులందరికీ ఓటు హక్కు లభించేలా చర్యలు, వికారాబాద్ జిల్లా పరిగి పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డులో శనివారం ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఈ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ కొరకు వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా పీఎస్-212, పీఎస్-214, పీఎస్-215, పీఎస్-216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఏఎస్‌డీ ఆబ్సేంట్, షిఫ్టేడ్, డెత్, డబుల్ ఓటర్ల జాబితాలపై అధికారులు, ప్రజాప్రతినిధు ల సమక్షంలో సమగ్ర సమీక్ష చేపట్టారు. ఖాన్ కాలనీలోని సిద్ధార్థ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో పీఎస్-214, 215ల పరిధికి చెందిన ఓటర్ల నుంచి స్వీకరించిన ఎన్యూమరేషన్ ఫారాలు, వాటి డిజిటలైజేషన్ ధృవీకరణ వివరాలను బీఎల్ఓలు వెల్లడించారు. అలాగే సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో మరణించిన, శాశ్వతంగా చిరునామా మారిన, రెండు చోట్ల ఓటు నమోదైన డబుల్ ఓటర్లతో పాటు అందుబాటులో లేనివారి వివరాలను బీఎల్ఓలు సభలో చదివి వినిపించారు. స్థానికుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సవరించిన జాబితాకు సభలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నా మని అధికా రులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, మున్సిపల్ కమి షనర్ కె. మల్లేష్, వార్డు కౌన్సిలర్ సమీనా మీర్ తాహేర్ అలీ, బీజేపీ పరిగి ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి, నాయకులు అనూష, ముకుంద నాగేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, ఖైసర్ బేగ్, ఖదీర్, అక్బర్, సంతోష్, సమీర్, కుర్వ నరేందర్, రఫీలతో పాటు బీఎల్ఏలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, బీఎల్ఓలు కాలనీవాసులు పాల్గొన్నారు.

## మెరిసే చర్మం, పట్టులాంటి జుట్టుకు ఇంటి చిట్కా,

### మనం వేస్ట్‌గా పడేసే బంగాళదుంపల తొక్కలు

వంట చేసే సమయంలో బంగాళాదుంప తొక్కలను తీసి చెత్తబుట్టలో వేసేస్తుంటాం. అయితే చాలామందికి తెలియని విషయం ఏమిటంటే.. ఈ తొక్కల్లో కూడా చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడే కొన్ని రకాల పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయని అధ్యయనం పేర్కొంది. అందుకే కొందరు సహజ సౌందర్య చిట్కాల్లో బంగాళాదుంప తొక్కలను ఉపయోగిస్తుంటారు. బంగాళదుంప తొక్కల్లో విటమిన్ సీ, ఐరన్, జింక్, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి.

**చర్మానికి సహజ కాంతిని అందిస్తుంది**

బంగాళాదుంప తొక్కల్లో విటమిన్ జ, యాంటీఆక్సిడెంట్లు, కొన్ని వృక్ష సమ్మేళనాలు ఉంటాయి. ఇవి చర్మ కణాలను ఫ్రీ రాడికల్స్ ప్రభావం నుంచి రక్షిస్తాయి. తాజాగా శుభ్రం చేసిన బంగాళాదుంప తొక్కలను ఓ గుప్పెడు తీసుకుని ఒక చెంచా కలబంద గుజ్జును యాడ్ చేయండి. దీనిలో కొంచెం పాలు వేసి మెత్తటి పేస్ట్‌లా చేయండి. ఈ పేస్ట్‌ను దీనిని మీ ముఖానికి రాసుకుని సుమారు 15 - 20 నిమిషాల పాటు అలాగే ఆరనివ్వండి. ఆ తర్వా త మంచి నీళ్లతో శుభ్రం చేయండి. సహాయపడుతుంది.

# సీఎం సొంత జిల్లాలోనే దళితులకు అన్యాయమా

- అభివృద్ధి పేరిట దళిత రైతుల భూముల కబ్జా..
- కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల నిరసన
- పరిహారంఇవ్వకుండా భూములు గుంజుకుంటే ఊరుకోం..
- దౌలాపూర్ దళిత రైతుల భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలి
- కలెక్టర్ కు కేవీపీఎస్, ప్రజాసంఘాల వినతి..



**వికారాబాద్, ఆగస్టు 2 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** పరిహారం ఇవ్వకుండా భూములు గుంజుకుంటే ఊరుకోం..ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో సీఎం సొంత జిల్లాలోనే దళితులకు అన్యాయం చేస్తారా.. కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల నిరసన పేద, దళిత రైతుల భూములను ఎలాంటి నష్టపరిహారం చెల్లించ కుండా గుంజుకోవడం సరికాదని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని కేవీపీఎస్ కులాంతర వివాహితుల, దళిత హక్కుల పోరాట సమితి వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.? ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు. బుగ్గప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాలాల మండలం, దౌలాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 73లో, చెన్నారం మరియు దౌలాపూర్ గ్రామాలకు చెందిన 11 దళిత, వడ్డే కులాల పేద కుటుంబాలకు 1980వ సంవత్స రంలో ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కుటుంబానికి దాదాపు 2 ఎకరాల చొప్పున సాగు కోసం పంపిణీ చేసింది. జీవనాధారం: నాటి నుంచి నేటి వరకు ఆ రైతులు సదరు భూమిని సాగు చేసుకుంటూ దానిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇటీవల ఇంటిగ్రాటెడ్ స్కూల్ (సమగ్ర పాఠశాల) నిర్మాణం పేరిట ఎలాంటి ముందస్తు సమా చారం ఇవ్వకుండా అధికారులు, కాంట్రాక్టర్లు దౌర్జన్యంగా రైతుల పొలాల నుంచి ఎర్ర మట్టిని తరలించారని నాయకులు ఆరోపించారు. దీనివల్ల భూమి సాగుకు పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే పేద రైతుల భూములను లాక్కుంటూ, పరిహారం చెల్లించకపోవడం శోచనీయం. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు భూమికి ప్రత్యామ్నాయ భూమిని ఇవ్వాలి లేదా ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి. అధికారుల తీరు మార్చుకోవాలి: చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి. బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించి న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సతీష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుదర్శన్, కేవీపీఎస్ నాయకులు కోళ్ల గోపాల్, బక్కని రాజు వడ్డే, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లాలయ్య, జోగు లాలయ్య, చంద్రయ్య, చంద్రమ్మ, అంజిలమ్మ, వెంకటయ్య, పెద్ద వెంకటయ్య, మన్యప్ప, సత్యమ్మ, అమృతమ్మ తదితర బాధిత రైతులు పాల్గొన్నారు.

### నిమ్స్‌లో యువతిపై లైంగిక వేధింపులు

# నిందితుడు అరెస్ట్



**ఖైరతాబాద్ :** నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ యువతిపై మరో రోగికి సహాయకుడిగా వచ్చిన వ్యక్తి కీచక పర్వానికి ఒడిగట్టాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు గత నెల 27న రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు విరిగిపోయిన కుమార్తె(18) ను నిమ్స్‌లో చేర్చాడు. ఆమెకు ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున తండ్రి మరుగుదొడ్డికి వెళ్లిన సమయంలో పక్క బెడ్‌లో చికిత్స పొందుతున్న రోగికి సహాయకుడిగా వచ్చిన నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి యువతి వద్దకు వెళ్లి అసభ్యకరంగా తాకుతూ లైంగికంగా వేధించాడు.
ఘటన అనంతరం తీవ్ర భయాందోళనకు గురైన యువతి తన తండ్రికి జరిగిన దారుణాన్ని వివరించింది. విషయాన్ని అదేరోజు సాయంత్రం ఆస్పత్రి సిబ్బందికి తెలియజేయగా, పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రిలోని సీసీటీవీ దృశ్యాలు, అక్కడి సిబ్బంది, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సేకరించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
కాగా యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడు నాగేశ్వర్‌రావు ఏపీలోని భీమవరానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గురించారు.
నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిం చినట్లు పంజాగుట్ట సీఐ జహంగీర్ యాదవ్ తెలిపారు.

### ప్రతి ఒక్కరూ బాధ్యతగా

# మొక్కలు నాటాలి



- పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్..

**కొందుర్గు ఆగస్టు 2 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించినప్పుడే పచ్చని, పరిశుభ్రమైన సమాజం సాధ్యమ వుతుంది" అని పర్వతాపూర్ గ్రామ సర్పంచ్ బోయ అశోక్ గారు అన్నారు. పర్వతాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న "ఒక్కో కుటుంబం -- ఒక్కో మొక్క, పచ్చని పర్యావరణం మన లక్ష్యం" కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటి, దానిని జాగ్రత్తగా పెంచడం ద్వారా గ్రామాన్ని పచ్చదనంతో, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం అనేది నేటి అవసరం మాత్రమే కాదని, రాబోయే తరాలకు మనం అందించే అమూల్యమైన కానుక అని ఆయన పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమానికి విశేషంగా తరలివచ్చి విజయవంతం చేసిన గ్రామ పెద్దలకు, మహిళలకు, యువతకు గ్రామ ప్రజలందరికీ సర్పంచ్ బోయ అశోక్ పంచాయతీ పాలకవర్గం హృదయపూ ర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపస ర్పంచ్ దామోదర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కాశ జంగయ్యవార్డు మెంబర్ మరాఠి సురేష్, స్కూల్ టీచర్ హారికవి ఓ కాశ వరలక్ష్మి, నాయకులు దర్గ వెంకటయ్య, గ్రామ ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రంగాపూర్ గ్రామపంచాయతీ

# అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- గ్రామసభలో సర్పంచ్ మందాకిని అరవింద్ రావు




**పరిగి, ఆగస్టు 2 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల ప్రాంగణంలో మొక్కలు నాటి, గ్రామాన్ని హరితమయంగా మార్చాలని ఆమె పిలుపునిచ్చిన సర్పంచ్ కరణం మందాకిని అరవింద్ రావు, శనివారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ కరణం మందాకిని అరవింద్ రావు, ఆధ్వర్యంలో గ్రామసభ సమావేశం అత్యంత కోలాహలంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారుజలసిరి పథకం యొక్క ప్రాముఖ్యతను, రైతులు మరియు గ్రామస్తులు దీని ద్వారా పొందే లబ్ధిని అధికారులకు, ప్రజలకు వివరించారు. గ్రామంలో రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై ప్రణాళికలు రూపొందించారు.
**వర్షాకాల జాగ్రత్తలు:** ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా చూడటం, పరిశుభ్రత పాటించడం మరియు దోమల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. గ్రామసభ ముగిసిన అనంతరం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సర్పంచ్ గారు గ్రామ మహిళలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు.
ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల ప్రాం గణంలో మొక్కలు నాటి, గ్రామాన్ని హరిత మయంగా మార్చాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరవింద్ రావు, ఉప సర్పంచ్ బాబ్యానాయక్, పంచాయతీ కార్యదర్శి జేయం విశ్వతేజ, ఏఈఓ, వివోఏ, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

### మూడు నెలల బియ్యం పంపిణీ ప్రారంభం

#### మొదటి రోజు కార్డుదారులకు తప్పని తిప్పలు



**అబిడ్స్:** మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ మళ్లీ ప్రారంభమైంది. శనివారం మొదటి రోజు రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులు క్యూ కట్టి బియ్యాన్ని పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎల్‌నిలో ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం ఆగస్టు మాసంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు ఒకేసారి అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో తెలంగాణ రాష్ట్రంలో శనివారం నాటి నుంచి పంపిణీని ప్రారంభించారు. హైదరాబాద్ జిల్లాలోని 843607 ఆహార భద్రత కార్డులు ఉండగా కార్డుదారులకు 59,602,822 మెట్రిక్ టన్నుల బియ్యం, 7,279,513 మెట్రిక్ టన్నుల గోధుమల నిల్వలను కేటాయించారు. రేషన్ బియ్యాన్ని కార్డులోని ప్రతి సభ్యునికి ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు 18 కిలోల బియ్యాన్ని కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉంటే అంతమందికి సరఫరా చేయాలని నిర్ణయించారు.గోధుమలు కిలో ఏడు రూపాయల చొప్పున జిల్లాలోని 653 చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీని శనివారం ప్రారంభించారు. ఆగస్టు 31వ తేదీ వరకు సరుకులను సరఫరా చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రేషన్ కార్డులలో ప్రతి కార్డుదారుని నుంచి మూడు సార్లు వేలి ముద్రలు తీసుకుని మూడు సార్లు తూకం చేయాల్సి వస్తుండడంతో దుకాణాల వద్ద క్యూ కట్టారు. మంది వరకు మాత్రమే బియ్యం అందించామని చౌకధరల దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మా ఇదేందమ్మా ఇల్లు

# వచ్చినా 6 లక్షలు కట్టేదెట్లా

**మేడ్చల్:** అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు లో మాత్రం నిబంధనలు పెట్టడటంతో ఇందిరమ్మ ఇండ్లకు నిరుపేదలు దూరమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తులు చేసుకునేందుకు రూ. 10వేల రుసుమును నిబంధనలో చేర్చడమే నిరుపేదలకు శాపమైంది. రూ.10వేల నిబంధనతో ఇక ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు కలగానే మిగలనుంది. పది వేల రుసుం చెల్లించలేక నిరుపేదలు దరఖాస్తు చేసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఈనెల 10 వరకు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం విధితమే. పది వేల రుసుం చెల్లించలేని నిరుపేదలు ఏమి చేయలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అప్పు చేసి దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కచ్చితంగా మంజూరు అవుతాయన్నదానికీ గ్యారెంటీ లేకుండాపోయింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని



మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బులాపూర్ నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 480 చొప్పున జీప్లస్ 10లో 1,920 ఇండ్లను మం జూరు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**ఇల్లు వచ్చినా రూ. 6లక్షలు కట్టేది ఎట్లా?**

నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఆధారంగా ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించనున్నారు. నియోజకవర్గానికి 480 కి మించి దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన లబ్ధిదారుడు మరో రూ. 6లక్షలు చెల్లిస్తే ఇందిరమ్మ ఇంటిని కేటాయించేలా ప్రొసిడింగ్ జారీ చేసి లబ్ధిదారులకు అందించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అర్హులైన నిరుపేదలు దరఖాస్తుకు పది వేల రుసుం కట్టడమే భారంగా ఉన్న నేపథ్యంలో ఇల్లు మంజూరైతే మరో రూ. 6 లక్షలు ఎక్కడి నుంచి తీసుకరావాలన్న ఆందోళన ఇప్పటి నుంచే నిరుపేదలలో ప్రారంభమైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్భాటంగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ఇంది రమ్మ ఇంటి పథకానికి దరఖాస్తులను స్వీక రించి ఎంతో హంగామా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో స్వీకరించిన దర ఖాస్తులు ఇప్పుడు మరుగున పడవేయటం ఏంటని నిరుపేదలు ప్రభుత్వాన్ని ప్రశ్ని స్తున్నారు.

# బోనాల ఎఫెక్ట్ హైదరాబాద్‌లో 3 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్ :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతర సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆగస్టు 2 నుంచి 4 వరకు ఆలయం చుట్టూ సుమారు 2 కిలోమీటర్ల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని పోలీసులు వెల్లడించారు. ఆగస్టు 1 అర్ధరాత్రి 12 గంటల నుంచి 4న తెల్లవారుజామున ఉదయం 3 గంటలకు జాతర పూర్తయ్యే వరకు కొన్ని మార్గాల్లో సాధారణ వాహనాల రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.ప్రధాన మళ్లింపులు ఇవే :పాట్నీ క్రాస్ రోడ్స్ : ఎస్‌బీఐ, ప్యారడైజ్ నుంచి ట్యాంక్ బండ్ వైపు వెళ్లే వాహనాలను మినిస్టర్ రోడ్, క్లాక్ టవర్, సంగీత్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, చిలకలగూడ, ముషీరాబాద్, కవాడిగూడ మీదుగా మళ్లిస్తారు. ప్యారడైజ్ నుంచి బైబిల్ హౌస్ వైపు వెళ్లే వాహనాలను ఎస్?బీఐ లేదా క్లాక్ టవర్ మీదుగా మళ్లిస్తారు.ఘస్‌మండి : బైబిల్ హౌస్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను సజ్జన్‌లాల్ స్ట్రీట్, రైల్వే స్టేషన్ మీదుగా లేదా హిల్ స్ట్రీట్, రాణిగంజ్ మీదుగా మళ్లిస్తారు.బైబిల్ హౌస్ : జబ్బార్ కాంప్లెక్స్, బన్సీలాల్‌పేట్ నుంచి వచ్చే వాహనాలను కర్బలా, రాణిగంజ్ వైపు




మళ్లిస్తారు.కర్బలా : చిల్డ్రన్స్ పార్క్, బైబిల్ హౌస్ దిశల నుంచి వచ్చే వాహనాలను రాణిగంజ్ క్రాస్ రోడ్స్ వైపు మళ్లిస్తారు.రాణిగంజ్ : కర్బలా మైదాన్ నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, సాధారణ వాహనాలను మినిస్టర్ రోడ్, రసూల్‌పురా, పీఎన్‌టీ ఫ్లై ఓవర్, సీటీవో, ఎస్?బీఐ, వైఎంసీఏ, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్, గోపాలపురం మీదుగా మళ్లిస్తారు. రైల్వే స్టేషన్ నుంచి ట్యాంక్ బండ్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను చిలకలగూడ, గాంధీ హాస్పిటల్, ముషీరాబాద్, కవాడిగూడ, మారియట్ హోటల్ మీదుగా మళ్లిస్తారు.ప్యారడైజ్ : సీటీవో నుంచి ఎంజీ రోడ్ వైపు వెళ్లే వాహనాలను సింధీ కాలనీ, మినిస్టర్ రోడ్, రాణిగంజ్, కర్బలా మైదాన్ మీదుగా మళ్లిస్తారు. పాట్నీ నుంచి వచ్చే వాహనాలను సీటీవో జంక్షన్ వైపు మళ్లిస్తారు.పార్కింగ్ ప్రాంతాలు : హరిహర కళాభవన్, యశోద హాస్పిటల్, మహబూబ్ కాలేజీ, సీఎంఆర్ షాపింగ్ మాల్, పాత జైలు ఖానా ఖాళీ స్థలం, ఇస్లామియా హై స్కూల్, ప్రభుత్వ అడవయ్య మెమోరియల్ హై స్కూల్, నల్లగుట్ట జీహెచ్ఎంసీ గ్రౌండ్, మహాత్మా గాంధీ విగ్రహం ఎంజీ రోడ్, పార్సీ టెంపుల్, వెస్లీ కాలేజీ లేదా జీహెచ్?ఎంసీ, జింఖానా గ్రౌండ్, స్వప్నలోక్ కాంప్లెక్స్, తాజ్ త్రీ స్టార్ లైన్.ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626 నంబర్?కు ఫోన్? చేయాలని అధికారులు సూచించారు.ఉజ్జయిని మహాకాళి బోనాలు ఇలా : తెలంగాణలో ఆషాఢంలో జరిగే అతి పెద్ద పండుగ బోనాలు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా బోనాల జాతర నిలుస్తోంది. ఆషాఢ మాసంలో కొత్తగా వివాహమైన అమ్మాయి పుట్టింటికి వెళ్లడం మన ఆచారం. ఇదే నేపథ్యంలో నిత్య పెళ్లి కుమార్తె అయిన అమ్మవారు ప్రతి ఆషాఢ మాసంలో తన పుట్టింటికి వస్తారని భక్తుల నమ్మకం. దీనిని దృష్టిలో ఉంచుకొని భక్తులు పండుగ రోజుల్లో అమ్మవారిని దర్శించుకొని కన్న కుమార్తె తమ ఇంటికి వస్తుందనే భావంతో భక్తి శ్రద్ధలతో బోనాల పేరిట నైవేద్యాన్ని సమర్పిస్తారు. సికింద్రాబాద్?లోని ఈ ఆలయం సుమారు 200 సంవత్సరాల క్రితం నాటిదని స్థానికుల విశ్వాసం. ఈ ఆలయంలో శక్తికి అధిదేవత అయిన మహాకాళి అమ్మవారు కొలువై ఉంటారు.

# రేషన్ కార్డుదారులకు గుడ్‌న్యూస్.. మూడు నెలల బియ్యం ఒకేసారి!



**మెదక్, ఆగస్టు 1 :** రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్-2026 నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నట్లు మెదక్ జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల్లో ఈ పంపిణీ కొనసాగుతున్నందున అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.అయితే మూడు నెలల బియ్యం పొందాలంటే రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడి ఈ-కేవైసీ (వ-ఖ్జ) పూర్తి చేసి ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఇంకా ఈ-కేవైసీ చేయించుకోని వారు వెంటనే సమీపంలోని రేషన్ దుకాణాన్ని సంప్రదించాలని కోరారు. చిన్నారుల ఈ-కేవైసీని ఐరిస్ పరికరం ద్వారా నమోదు చేసే సౌకర్యం కూడా అందుబాటులో ఉందని తెలిపారు.ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి ఎలాంటి ఆటంకం లేకుండా అందుతు ందని అధికారులు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులను ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.గ్రామాల్లో మైక్ అనౌన్స్‌మెంట్‌ల ద్వారా మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ, ఈ-కేవైసీపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. రేషన్ బియ్యం పంపిణీతో పాటు ఈ-కేవైసీ ప్రక్రియను సమాంతరంగా కొనసాగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద ఆదేశించారు.

# ఆపరేషన్ ముస్కాన్ -XII విజయవంతం.. 664 మంది చిన్నారుల సేఫ్



**హైదరాబాద్, ఆగస్టు 1:** సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్--శ××' విజయవంతంగా ముగిసింది. జులై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోలీసులు.. మొత్తం 664 మంది చిన్నారులను రక్షించారు. వీరిలో 644 మంది బాలురు, 20 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ ముస్కాన్లో భాగంగా తెలంగాణకు చెందిన 162 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన 502 మంది చిన్నారులను గుర్తించారు.ఆపరేషన్‌లో భాగంగా సైబరాబాద్ పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమలు, కంపెనీలు, దుకాణాలు, హోటళ్లు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలను, ర్యాగ్ పికింగ్‌తో, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించారు. రక్షించిన చిన్నారుల వివరాలను దర్పణ్ యాప్‌లో పోలీసులు నమోదు చేశారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చే లక్ష్యంతో పోలీసులు ఆపరేషన్ ముస్కాన్ చేపట్టారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చిన్నారుల భద్రతే లక్ష్యంగా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు.

# నర్మాలకు మళ్లీ జీవం నర్మాలకు మళ్లీ జీవం!

**దుబ్బాక(సిద్దిపేట):** మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల తో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరు (నర్మాల) ప్రాజెక్టుకు మళ్లీ జీవం వస్తోంది. కామారెడ్డి జిల్లా నుంచి పాల్వంచ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుండగా, సరిహద్దు జిల్లాల రైతన్నల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మా ల ప్రాజెక్టు వర్షాల కారణంగా మళ్లీ జీవం పోసుకుంటోంది. ఈ పరిణామం జిల్లా దుబ్బాకతో పాటు సరిహద్దు జిల్లాల రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ప్రాజెక్టుకు ప్రధాన జలవనరు అయిన కామారెడ్డి జిల్లాలో పాల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వరద నీటిని నర్మాలకు చేర్చుతోంది. మరోవైపు దుబ్బాక నియోజకవర్గానికి జీవనాధారమైన కూడవెల్లి వాగులోనూ ప్రవాహం మొదలైంది.పాల్వంచ ఉధృతి.. పెరుగుతున్న ఇన్‌ఫ్లోఎగువప్రాంతల్లో కురుస్తున్న వర్షాలతో పాల్వంచ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నాటికి ప్రాజెక్టులోకి 2,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతానికి ప్రాజెక్టు నుంచి



ఎలాంటి నీటిని విడుదల చేయలేదు. స్పిల్‌వేతో పాటు కుడి, ఎడమ ప్రధాన కాలువలు మూసివేసి ఉన్నాయి.ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఎగువ మానేరు ప్రాజెక్టు నీటిమట్టం 1472.67అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1482.50 అడుగులు కాగా, ప్రస్తుతం 0.912 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ప్రాజెక్టులో 1473.80 అడుగుల నీటిమట్టంతో 1.01 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది.దుబ్బాక ప్రాంతానికి జీవనాడిగా భావించే కూడవెల్లి వాగు, ఈ ఏడాది మల్లన్నసాగర్ నుంచి నీటి విడుదల సక్రమంగా లేకపోవడంతో ఎండిపోయింది. కురుస్తున్న వర్షాలకు వాగులో స్వల్పంగా ప్రవా హం వరకు నీరు చేరింది. శుక్రవారం సాయంత్రం మళ్లీ వర్షం ప్రారంభం కావడంతో, శనివారానికి వాగు మరింత ఉధృతిని సంతరించుకునే అవకాశముంది. ఈ వాగు పూర్తిగా ప్రవహిస్తే దీనిపై ఉన్న 54 చెక్‌డ్యాంలు నిండి పరివాహక రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుంది. పెరగనున్న భూగర్భ జలాలుఎగువ మానేరు ప్రాజెక్టు నీటిమట్టం పెరిగితే దుబ్బాక మండలంతో పాటు కామారెడ్డి జిల్లా బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని రైతులు భావిస్తున్నారు. ముఖ్యంగా దుబ్బాకతో పాటు చెల్లాపూర్, రాజక్కపేట, అప్పనపల్లి గ్రామాల వరకు నర్మాల ప్రాజెక్టు ఊట నీటి ప్రభావంతో బోరుబావుల్లో నీటి మట్టాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఆకాశం వైపే రైతుల చూపుదుబ్బాక నియోజక వర్గంలో ఆశించిన స్థాయిలో చెరువుల్లోకి నీరు చేరలేదు. చెరువులను పూర్తిస్థాయిలో మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానం చేయకపోవడంతోనే ఈ నీటి ఎద్దడి తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న ముసురువానలతో పాటు భారీ వర్షాలు నమోదైతేనే తడిసిన నేల నుంచి వరద నీరు నేరుగా చెరువుల్లోకి చేరే అవకాశం ఉంది. రానున్న రెండు రోజుల వర్షాలపైనే ఎగువ మానేరు నీటిమట్టం, భూగర్భ జలాల పెరుగుదల ఆధారపడి ఉంది.

# హైదరాబాద్‌లోని రద్దీ కూడళ్లలో స్కైవాక్‌లు

**హైదరాబాద్:** ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రాకపోకలను సులభతరం చేసేందుకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని ఉమ్మ వివిధ రద్దీ ప్రాంతాల్లో స్కైవాక్‌లు, పాదచారుల వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సికింద్రాబాద్, జేఎన్‌టీయూ వద్ద స్కైవాక్‌ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఉప్పల్ స్కైవాక్ ఇప్పటికే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారింది. మెహిదీపట్నం స్కైవాక్ పనులు కూడా త్వరలో మొదలు కానుండగా, ఇది త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.ఇటీవల ఉమ్మ ఎల్బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఐటీ కారిడార్‌లోని ఐకియా సమీపంలో అదనపు స్కైవాక్‌లను ప్రతిపాదించింది. ఈ మూడు ప్రాంతాలు అత్యంత రద్దీగా ఉంటాయి. ఇక్కడ రోడ్డు దాటడంలో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల ప్రమాదాలు, గాయాలు, ప్రాణనష్టం కూడా సంభవిస్తున్నాయి. ఐటీ కారిడార్‌కు అనుగుణంగా రూపొందించిన ఈ స్కైవాక్‌లలో ఆధునిక ఎస్కలేటర్లు, లిఫ్టులు, కవర్డ్ వాక్‌వేలు



ఉంటాయి. దీంతో ప్రజలు వర్షం లేదా తీవ్రమైన ఎండకు గురి కాకుండా తమ ఆఫీసులకు సులభంగా చేరుకోవచ్చు.ఐటీ కారిడార్ : ఐకియా జంక్షన్‌లో ప్రతిరోజూ లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మెట్రో స్టేషన్, మైండ్ స్పేస్ ఐటీ పార్కు, ఐకియాను కలుపుతూ స్కైవాక్ నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయి. ఫలితంగా రాయదుర్గం మెట్రోస్టేషన్‌లో దిగే వేలాది మంది ఉద్యోగులు నలువైపులా సులభంగా వెళ్లడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.దిల్‌సుఖ్‌నగర్ : దిల్‌సుఖ్‌నగర్ అనేది అతిపెద్ద వాణిజ్య కేంద్రం. కోచింగ్ సెంటర్లకు హబ్. నిత్యం వేలాది మంది విద్యార్థులు, కొనుగోలు దారులతో రద్దీగా ఉంటుంది. బస్సులు దిగిన విద్యార్థులు, ప్రజలు తరచూ ట్రాఫిక్?లో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నారు. మెట్రో స్టేషన్, బస్ బే, స్థానిక కాలనీలను కలిపే స్కైవాక్ నిర్మిస్తే అందరికీ ఉపశమనం దొరుకుతుంది.ఎల్బీనగర్‌లో పరిస్థితి ఇలా : 'ఎల్బీనగర్.' విజయవాడ-నల్గొండ జాతీయ రహదారులను కలిపే అత్యంత కీలకమైన జంక్షన్?. ఇక్కడ మెట్రో రైలు ఉంది. వందల సంఖ్యలో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఎప్పుడూ రోడ్లపై తిరుగుతూనే ఉంటాయి. ఇక్కడ రోడ్డు దాటాలంటే చుక్కలు కనిపిస్తాయి. స్కైవాక్?తో ఎల్బీ నగర్ మెట్రోస్టేషన్, బస్టాండ్, కాలనీలకు వెళ్లే ప్రయాణికులకు వెసులుబాటు లభించనుం ది.స్కైవాక్‌లతో కలిగే ప్రయోజనాలు :వాఎ ానాలు వేగంగా వెళ్లే దగ్గర, జంక్షన్ల దగ్గర రోడ్డు ప్రమాదాలను నివారిస్తుంది.వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ఎలాంటి భయం లేకుండా రోడ్డు దాటవచ్చు.ఆధునిక స్కైవాక్?లలో వికలాంగుల కోసం ప్రత్యేక లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు.జనాలు రోడ్డు దాటడానికి వాహనాలను ఆపాల్సిన అవసరం ఉండదు. దీంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు తగ్గి, వాహనాల వేగం, ఇంధన ఆదా పెరుగుతుంది.మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లను నేరుగా కలుపుతూ స్కైవాక్స్ నిర్మించడం వల్ల ప్రయాణికులు ఒక మోడ్ నుంచి మరో మోడ్‌కు సులభంగా మారవచ్చు.దీంతో ప్రయాణికులు ఎండ, వాన తగలకుండా ఒక చోటు నుంచి మరో చోటుకి వెళ్లవచ్చు.కొన్ని స్కైవాక్స్ నేరుగా షాపింగ్ మాల్స్ లేదా సముదాయాలకు అనుసంధానం చేసి ఉంటాయి. దీనివల్ల వ్యాపారాలు, కస్టమర్ల సంఖ్య పెరుగుతుంది.బిజీగా ఉండే కూడళ్లలో రోడ్డు దాటడానికి ఎక్కువ సమయం వృథా కాదు.వాహనాలు సిగ్నల్స్ దగ్గర ఆగకుండా నిరంతరాయంగా ప్రయాణిస్తాయి.చక్కని డిజైన్లతో నిర్మించే స్కైవాక్స్ హైదరాబాద్?కు ఆధునిక రూపాన్ని ఇస్తాయి.రాత్రి వేళల్లో వీటి దీపాల అలంకరణ పర్యాటకులను ఆకర్షిస్తుంది.

# లష్కర్ బోనాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



**హైదరాబాద్:** లష్కర్ బోనాలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి 175 ప్రత్యేక బస్సులు నడపడానికి చర్యలు చేపట్టామని ఆర్టీసీ గ్రేటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఎంజీబీఎస్, కాచిగూడ రైల్వేస్టేషన్, జేబీఎస్, చార్మినార్, బాలాజీనగర్, నాంపల్లి, రిసాల్‌బజార్, వెంకటాపురం, ఓల్డ్ అల్వాల్, మెహిదీపట్నం, కుషాయిగూడ, చర్లపల్లి, హకీంపేట, ఓల్డ్ బోయిన్‌పల్లి, చార్మినార్, మెహిదీపట్నం,సైనిక్‌పురి, సనత్‌నగర్, జామై ఉస్మానియా, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, బోరబండ, పటాన్‌చెరు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సులు, ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసింది.

# భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం.. మూడో ప్రమాద హెచ్చరిక జారీ

**భద్రాచలం :** భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 50 అడుగులు దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి 53 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం శనివారం ఉదయానికి 55.1 అడుగులకు పెరిగింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.భద్రాచలం -- వెంకటాపురం మార్గంలో రహదారిపైకి వరద నీరు చేరింది. దీంతో భద్రాద్రి ఏజెన్సీలోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక, చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపును గోదావరి వరద చుట్టుముట్టింది. అక్కడి గోదావరి పాయలోని ఇసుక ర్యాంపులో లారీ డ్రైవర్లతోపాటు 46 మంది ర్యాంపు సిబ్బంది చుక్కుకుపోయారు. లారీలు కూడా అందులోనే ఉన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు.. రెస్క్యూ బృందాలను రంగంలోకి దింపారు. ఆ బృంద సభ్యులు యంత్రాలు, తెప్పలపై వెళ్లి ర్యాంపు సిబ్బందిని, డ్రైవర్లను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. తెప్పపై వెళ్తున్న చర్ల సీఐ రాజువర్మకు తృటిలో ప్రమాదం తప్పింది.

# సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా

**హైదరాబాద్:** తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం -- ప్రజాస్వామ్యం -- పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు.ఈ




సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..?ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? చెబితే నచ్చవన్నారు.

## సౌత్ కోస్టల్ రైల్వే జీఎం మాథుర్‌ను కలిసిన ఎంపీ శివనాథ్



**విజయవాడ, ఆగస్టు 1 :** సౌత్ కోస్టల్ రైల్వే జీఎం మాథుర్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం) కలిశారు. జీఎం మాథుర్‌ను కలిసి పలు కీలక అంశాలపై చర్చించామని తెలిపారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయాలని అడిగామని చెప్పారు. విజయవాడ చుట్టుపక్కల రైల్వే సమస్యల గురించి తెలిపామని అన్నారు. విజయవాడకు ట్రాఫిక్ సమస్య తీరేలా 8 ఆర్వోబీల ఏర్పాటు గురించి మాట్లాడామని తెలిపారు. ఎర్రకట్ట వంతెన పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు అతి ముఖ్యమని చెప్పుకొచ్చారు. గుణదల రాజ-8 కూడా చాలా అవసరమని తెలిపామని ఎంపీ శివనాథ్ అన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి టెండర్లు వేసినా ఎవరూ రాలేదని చెప్పారు. కేంద్ర రైల్వేమంత్రిని ఎంపీలందరం కలిసి విజయవాడను అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయాలని కోరుతామని అన్నారు. విజయవాడ - బెంగళూరు వయా గుత్తి రైల్వేలైన్ కావాలని కేంద్రమంత్రిని తాము అడుగుతామని ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు.

# కళ్లు తెరిచి చూడండి - ఎర్రబస్సులు కాదు ఎయిర్ బస్‌లు తిరిగే ప్రాంతం

**భోగాపురం :** ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎర్రబస్సులు కాదు.. ఎయిర్‌బస్‌లు తిరిగే ప్రాంతమని నిరూపించామన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్రమంత్రి మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో భోగాపురం విమానాశ్రయం సింహద్వారంలా ఉందని కేంద్రమంత్రి రామ్మోహన్?నాయుడు అన్నారు. ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఎర్రబస్సులు తిరిగే ప్రాంతమని కొందరు హేళన చేశారని, ఇవాళ కళ్లు తెరిచి చూడండి.. ఎయిర్ బస్? తిరిగే ప్రాంతంగా మారిందని పేర్కొన్నారు. ఎక్కడా జరగని అభివృద్ధి ఉత్తరాంధ్రలో జరుగుతోందన్నారు. ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు మోదీ అని కొనియాడారు."ఏ



ప్రాంతంలో జరగని అభివృద్ధి ఉత్తరాంధ్రలో సాధ్యం కాబోతోంది. ఉత్తరాంధ్రలో ఉండే ప్రతి ఇంటి పండుగ ఇది. మన్యం వీరుడు అల్లూరి పేరు ప్రపంచం మొత్తం మార్మోగుతోంది. అభివృద్ధిని తీసుకొచ్చారు. ఇక ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లడమే. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల సత్తా మన ప్రధాని మోదీది. ప్రధాని అందిస్తున్న సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నా" రామ్మోహన్‌నాయుడు, కేంద్రమంత్రిఉత్తరాంధ్రను సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు ఇది: భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభం నవ్యాంధ్ర ప్రయాణంలో పెద్ద మైలురాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివా సవర్మ అన్నారు. ఈ విమానశ్రయం ఉత్తరాంధ్ర ప్రజలకు ఒక వరంలా మారనుందన్నారు. రాష్ట్ర ప్రగతిని ప్రధాని మోదీ తన భుజాలపై ఎత్తుకుని నడిపిస్తున్నారని తెలిపారు. ఉడాన్ పథకంతో సామాన్యుడు కూడా విమాన ప్రయాణం చేయాలనేది ప్రధాని సంకల్పమని స్పష్టం చేశారు."ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు ఈ విమానాశ్రయం ఒక వరం. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారు. ఏపీ అభివృద్ధిని ప్రధాని మోదీ తన భుజాలపై ఎత్తుకున్నారు. ఉత్తరాంధ్ర ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. మోదీ వచ్చాక విమానాశ్రయాల సంఖ్య 160కి పైగా పెరిగింది. సామాన్యుడు కూడా విమాన ప్రయాణం చేయాలనేది ప్రధాని సంకల్పం. ఉడాన్ పథకంతో దేశ విమానయాన రూపురేఖలు మారాయి. ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో గ్లోబల్ మ్యాప్‌లో చోటు దక్కింది".

# భోగాపురం విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

**భోగాపురం :** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానా శ్రయం ప్రారంభోత్సవం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఘనంగా జరిగింది. ప్రధాని వెంట గవర్నర్ జస్టిస్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయు డు, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సహాయ మంత్రులు మురళీధర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.మల్లిఖార్జునరావు, జీఎం ఆర్ గ్రూపు బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెర్మినల్ భవనం ఆధునిక సదుపాయాలను ప్రధాని పరిశీలించారు. టెర్మినల్ సందర్శనలో భాగంగా చెక్-ఇన్ హాల్, విమానాశ్రయ రూపకల్పన, సాంకేతిక ప్రత్యేకతలను ప్రధాని మోదీకి



జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు వివరించారు. 13,750 మందితో థింసా నృత్యం : విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా థింసా నృత్యాన్ని ప్రదర్శించారు. మొత్తం 13,750 మంది ఈ నృత్యం చేసి ప్రధానికి ఘన స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల నుంచి వచ్చిన గిరిజన మహిళలు, విద్యార్థినులు, మహిళా సంఘాల సభ్యులు థింసా నృత్యంలో పాల్గొన్నారు. దీనికోసం ప్రయాణికుల టెర్మినల్ భవనం నుంచి సభా వేదిక వైపు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా భారీ వేదిక ఏర్పాటు చేశారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు : అనంతరం బహిరంగ సభా వేదికపై నుంచే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభో త్సవాలు, శంకుస్థాపనలను మోదీ చేశారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానా శ్రయ ప్రారంభ శిలాఫలకం ఆవిష్కరించారు. విశాఖపట్నం తర్లువాడలో ఏఎస్ఐపీ టెక్నాలజీస్ సెమీకండక్టర్ ప్యాకేజింగ్ - టెస్టింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. కర్నూలు లోని విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ప్రధాని ప్రారంభించారు. అనంతపు రంలో 2500 మెగావాట్లు, కర్నూలులో 1000 మెగావాట్లు సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ పథకాలను ప్రారంభించారు. కర్నూలు-×ఎ రెన్యూవబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు, పెంచలకోన-- యరపాడు మధ్యన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఖమ్మం--దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే, ఖమ్మం--దేవరపల్లి ప్యాకేజీ, తాడిపత్రి నాలుగు లేన్ల బైపాస్ రహదారులను ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలకాల ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే కోసం పోలీసుల గాలింపు

**ఏలూరు:** గుంటూరు తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు ముస్తఫా కోసం ఏలూరు జిల్లా నూజివీడు పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు బషీర్‌పై నమోదైన పలు క్రిమినల్ కేసుల నేపథ్యంలో ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వారి ఆచూకీ తెలిస్తే చెప్పాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పొగాకు లోడుతో వెళుతున్న వాహనాన్ని బలవంతంగా తీసుకెళ్లడం, బాధితులను డబ్బు కోసం అపహరించడం, కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుమారుడు బషీర్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా, బషీర్ పోలీసులకు కనిపించకుండా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అదే సమయంలో వారి



ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం అందించాలని కోరుతూ నూజివీడు పోలీసులు సోషల్ మీడియాలో ప్రజా ప్రకటన విడుదల చేశారు. ముస్తఫా, బషీర్ వివరాలు తెలిసిన వారు 9154876161, 9154876238 నంబర్లకు సమాచారం అందించి దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు. కాగా, ఈ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారు

**విజయనగరం జిల్లా, ఆగస్టు 1 :** నవ్యాంధ్ర ప్రయాణంలో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కీలక మైలురాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మఅభివర్ణించారు. ఈ విమా ఓనాశ్రాయం ప్రారంభం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రను సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు ఇదని పేర్కొన్నారు. ఈ రోజు (శనివారం) భోగ ఓపురం ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీనివాసవర్మ మాట్లాడారు. ఏపీ అభివృద్ధిని ప్రధాని మోదీ తన భుజాలపై ఎత్తుకున్నారని శ్రీనివాసవర్మ ప్రశంసించారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారని ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్ర ఉత్పత్తులను నేరుగా



విదేశాలకు ఎగుమతి చేయొచ్చని తెలిపారు. మోదీ వచ్చాక విమానాశ్రయాల సంఖ్య 160కి పైగా పెరిగిందని వివరించారు. సామాన్యుడు కూడా విమాన ప్రయాణం చేయాలనేది ప్రధాని సంకల్పమని చెప్పుకొచ్చారు. విమాన ప్రయాణం అంటే గతంలో డబ్బు ఉన్న వాళ్లకే సాధ్యమయ్యేదని అన్నారు. ఉడాన్ పథకంతో దేశ విమానయాన రూపురేఖలు మారాయని భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు.

## ఇంటరాగేషన్ గదిలో రక్తపు మరకలు ఎందుకున్నాయ్?

అమరావతిసాయికృష్ణ కేసులో నిందితుడు సస్పెండైన సీఐ నాగరాజును రెండోరోజు సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఏడు గంటల పాటు జరిగిన విచారణలో సీఐ నాగరాజు చాలా ప్రశ్నలకు సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తో ంది. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లోని ఇంటరా గేషన్ గదిలో రక్తపు మరకలు ఎందుకున్నాయి, అవి ఎవరివి, ఆ గదికి ఎందుకు పెయింటింగ్ వేయించారని సిట్ ప్రశ్నించగా తనకు తెలియదని సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఆధారాలతో ప్రశ్నలు వేస్తే సీఐ మౌనం వహించినట్లు సమాచారం .మీ ఆదేశాల మేరకే పెయింటింగ్ వేయించినట్టు ఓ కానిస్టేబుల్ చెప్పాడని సిట్ అధికారులు తిరిగి అడగ్గా, ఎందుకు అలా చెప్పాడో ఆ కానిస్టేబుల్నే అడగాలని, తనకు సంబంధం లేని



విషయమంటూ దాటవేత ధోరణిని నాగరాజు ప్రదర్శించినట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ బృందం మార్కాపురం నుంచి సాయికృష్ణను స్టేషన్‌కు తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్?కు అప్పగించిన విషయమే తన దృష్టికి రాలేదని, సెంట్రీలకు అప్పగించారంటూ తప్పించుకునే ధోరణిలో నాగరాజు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఆర్ఎం పీని పిలిచి ఇంజెక్షన్ ఎందుకు చేయించారు: ఆర్ఎంపీని పిలిపించి సాయికృ ష్ణకు ఎందుకు ఇంజెక్షన్ ఇవ్వాల్సి వచ్చిందని సిట్ అధికారులు ప్రశ్నించగా, అదేమీ తనకు తెలియదని, ఆర్?ఎంపీని పిలిచిన కానిస్టేబుల్‌నే అడగాలంటూ నాగరాజు సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. విచారణకు నాగరాజు సరిగా సహకరించకపోవడంతో ఈ కేసులో ఇప్పటివరకూ సేకరించిన ఆధారాలను చూపిస్తూ ప్రశ్నించగా ఆయన మౌనంగా ఉండిపోయినట్లు సమాచారం. వారం రోజుల పాటు విచారణ: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న సీఐ నాగరాజును సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిట్ అధికారులు వారం రోజుల పాటు విచారించనున్నారు. ఈ క్రమంలో సీఐ నాగరాజును గురువారం ఉదయం విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టారు. రాజమహేంద్రవరం న్యాయమూర్తి సెలవులో ఉండటం వల్ల ఇంఛార్జి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. సీఐ నాగరాజును ఎన్ని గంటల వరకు విచారణ చేయాలన్న దానిపై న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విచారణ చేయాలని కోర్టు ఈ సందర్భంగా ఆదేశించింది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నాగరాజుకు భద్రత కల్పించాలని సూచించింది. దీంతో నాగరాజును కస్టడీలోకి తీసుకుని సిట్ కార్యాలయానికి తరలించారు. సాయికృష్ణ అదృశ్యం కేసులో నాగరాజు ఏ1గా ఉన్న విషయం తెలిసిందే.

# అర్థమైందా రాజా! - 'ఎర్రబస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్ట్ వచ్చింది'

**భోగాపురం :** 'ఎర్రబస్సు రాని ఊరికి విమానాశ్రయం అవసరమా? అని కొందరు అవహేళన చేశారు. ఉత్తరాంధ్రను తక్కువ అంచనా వేసి ఇక్కడి ప్రజలను అవమానించిన వారికి భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానా శ్రయమే ఒక చెంపపెట్టు. ఎర్రబస్సు రాదన్న చోటుకే ఎయిర్‌బస్ వచ్చింది. ఏకంగా మన ప్రధాని 'నమో' వచ్చారు. ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ అర్థమైందా రాజా!' అంటూ మంత్రి లోకేశ్ ప్రతిపక్షాలపై పదునైన వ్యాఖ్యలు చేశారు. భోగాపురంలో జరిగిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన పౌరుషాల గడ్డ ఉత్తరాంధ్ర అని లోకేశ్ కొనియాడారు.'ఇది కేవలం ఒక



విమానాశ్రయ ప్రారంభోత్సవం కాదని ప్రధాని మోదీ 'వికసిత్ భారత్', సీఎం చంద్రబాబు 'విజన్' కలిసిన సుదినమని చెప్పారు. ఉత్తరాంధ్ర దశ, దిశ మారే రోజని అభివర్ణించారు."నాకు అల్లూరి పట్టుదల, దేశభక్తి ప్రధాని మోదీలో కనిపిస్తాయి. 'నమో' అంటే ధైర్యం, విశ్వాసం, సురక్షిత భారత్. శత్రువుల గుండెల్లో భయం పుట్టించాలన్నా, పేదల సంక్షేమంతో పాటు భవిష్యత్?కు భరోసా కావాలన్నా దేశ ప్రజలకు ఒకే ఒక్క సమాధానం నరేంద్ర మోదీ. రాష్ట్ర విభజన తర్వాత కట్టుబట్టలతో ప్రయాణం ప్రారంభించిన ఏపీని మోదీ అక్కున చేర్చుకున్నారు. దేశమంతటికీ నమో అంటే గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ. కానీ మన ఏపీలో మాత్రం నాయుడు-మోదీల జోడీ. ఈ ఇద్దరి కలయికే డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్". -లోకేశ్, మంత్రి'కేంద్ర సహకారంతోనే అతిపెద్ద విమానాశ్రయం రికార్డు సమయంలో పూర్తయింది. పోలవరం, అమరావతికి నిధులు, విశాఖకు రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్ రక్షణకు ప్రత్యేక ప్యాకేజీ, కర్నూలులో హైకోర్టు బెంచ్, గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, ఏఎంసీఏ ఫైటర్ జెట్ ప్రాజెక్టులు రాష్ట్రానికి రావడానికి మోదీయే కారణం. ప్రధాని విజన్, ముఖ్యమంత్రి ఎగ్జిక్యూషన్ ఈ రెండింటి ఏకైక లక్ష్యం వికసిత్ ఉత్తరాంధ్ర' అని లోకేశ్ స్పష్టం చేశారు.'గతంలో ఉత్తరాంధ్ర అంటే వెనుకబాటుతనం, వలసలు, చిన్నచూపు గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. యువత ఉద్యోగాల కోసం విమానాలు ఎక్కి వెళ్లే రోజులు పోయాయి. అవకాశాలే విమానమెక్కి ఉత్తరాంధ్రకు వస్తాయి. రికార్డు సమయంలో ఎయిర్‌పోర్ట్?ను నిర్మించిన జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు తన జన్మభూమి రుణం తీర్చుకున్నారు.

## ఏపీలో పెరగనున్న వర్షాలు



**విశాఖపట్నం:** నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి రెండు నెలలు రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం నెలకొన్న పరిస్థితులు ఆగస్టు నెలలో కొంతవరకు మెరుగుపడనున్నాయి. ఈనెలలో ఉత్తర, దక్షిణకోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానున్నది. ఈ మేరకు శుక్రవారం భారత వాతావరణ శాఖ విడుదలచేసిన బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టు, సెప్టెంబరు నెలలకు కలిపి వర్షపాతం, ఉష్ణోగ్రతల వివరాలు వెల్లడించింది. ఈ బులెటిన్ ప్రకారం ఉత్తర కోస్తాలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు, కాకినాడ, కోనసీమ, దక్షిణ కోస్తాలో ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమలో తిరుపతి, చిత్తూరు, కడప, నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువగా, మిగిలిన ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుంది.

# 'నన్ను క్షమించండి ఇదే నా మొదటి, చివరి తప్పు'



**న్యూ ఢిల్లీ :** విద్యార్థుల నిరసన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కేసు నమోదైన బాలికకు సంబంధించిన క్షమాపణ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చేతులు జోడించి కనిపించిన ఆమె, తన వ్యాఖ్యలపై తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ దేశ ప్రజలకు క్షమాపణ కోరింది. నిరసన కార్యక్రమంలో కొందరి ప్రభావానికి లోనై ప్రధానిపై తీవ్ర వ్యాఖ్యలు చేశానని తెలిపింది."నిరసనలో కొంతమంది చెప్పిన మాటలకు ప్రభావితమై ప్రధానమంత్రి గురించి చాలా తప్పుగా మాట్లాడాను. నేను చేసిన పని క్షమించరానిది. నేను కేవలం 15 ఏళ్ల బాలికను. నా వల్ల పెద్ద తప్పు జరిగింది. ఇది నా జీవితంలో మొదటి, చివరి తప్పు. దేశ ప్రజలందరికీ చేతులు జోడించి క్షమాపణ కోరుతున్నాను. నేను చేసిన పనికి నాకు చాలా సిగ్గుగా ఉంది. దయచేసి నన్ను క్షమించండి" అని బాలిక వీడియోలో విజ్ఞప్తి చేసింది.ఎఫ్ఐఆర్‌లో వయుసు 25అయితే ఈఘటనపై నమోదైన ఎఫ్?ఐఆర్?లో సంబంధిత యువతి వయసు 25 సంవత్సరాలుగా ఉన్నట్లు సమాచారం. అయితే క్షమాపణ వీడియోలో మాత్రం తాను 15 ఏళ్ల బాలికనని ఆమె చెప్పడం గమనార్హం. ఈ అంశంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ప్రధానిపై చేసిన వ్యాఖ్యలపై బుధవారం నోయిడాలోని ఒక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. అనంతరం నోయిడా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును దర్యాప్తు కోసం దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఫిర్యాదుదారు ప్రకారం, ప్రధానమంత్రి పదవి గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అవి సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని ఆరోపించారు.మోదీ క్షమాభిక్షకు పిలుపుఈ క్షమాపణ వీడియో వెలుగులోకి రావడానికి కొన్ని గంటల ముందే ప్రధాని నరేంద్ర మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక వీడియో విడుదల చేశారు. జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల నిరసన సందర్భంగా తనపై, తన దివంగత తల్లిపై స్పందించారు. "జంతర్ మంతర్‌లో ఏం జరిగిందన్నది ప్రపంచం, యావద్దేశం చూశాయి. కొంతమంది ఆకతాయి పిల్లలు దుర్భాషలకు దిగారు. వారు మాట్లాడిన మాటలు సభ్య సమాజానికి తగినవి కావు. నన్ను, దివంగతురాలైన నా తల్లినీ తిట్టిపోశారు. అవి ఎంత అంద వికారమైన మాటలో నాకు తెలీదు. మన ఆడబిడ్డలు కూడా ఇలాంటి దారుణమైన భాషను వాడగలరన్నది సాంస్కృతికంగా దిగ్భ్రాంతికరం' అని ఎక్స్? వీడియోలో తెలిపారు. అయితే ఇలా దూషించడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని ప్రధాని మోదీ చెప్పారు. చిన్న వయసులో తప్పులు జరుగుతుంటాయని, ఆ వయసు వాటిని సరిదిద్దుకునే అవకాశాన్ని కూడా ఇస్తుందని తెలిపారు. కోపం లేదా ప్రతీకారం సమస్యకు పరిష్కారం కాదని, వారిని కోర్టుల చుట్టూ తిప్పడం, వేధించడం వల్ల పరిస్థితులు మారవని పేర్కొన్నారు. వారిని క్షమించాలనుకుంటున్నానని చెప్పారు. సమాజం కూడా అదే దృక్పథంతో ముందుకు రావాలని కోరారు. మనమంతా కలిసి భారత్ అభివృద్ధి కోసం పనిచేద్దామని ప్రధాని మోదీ తన సందేశంలో పిలుపునిచ్చారు. అయితే ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. దేశ ప్రజలు ఆయన నుంచి క్షమాపణ ఆశిస్తున్నారని తెలిపింది. అందుకు బదులుగా దేశాన్ని క్షమించడాన్ని ఆయన ఎంచుకున్నారని కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# సీఎంపై దాడికి కుట్ర.. జైషే ఉగ్రవాది ప్రియురాలు అరెస్ట్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడి కోసం కుట్ర పన్నారనే ఆరోపణలపై అనుమానిత జైష్ ఉగ్రవాది ప్రియురాలిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజకీయ నాయకులు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకునే హనీట్రాప్ నెట్‌వర్క్‌లో ఆమె భాగమని అనుమానిస్తున్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారిపై దాడికి జైష్-ఎ-మొహమ్మద్ కార్యకర్త హమీమ్ మండల్ ప్రణాళిక రచిస్తున్నట్లు బెంగాల్ పోలీసుల దర్యాప్తులో తెలిసింది. దీంతో పూర్బ బర్ధమాన్‌లో అతడ్ని అరెస్ట్ చేశారు.కాగా, హమీమ్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్న అతడి ప్రియురాలు అర్పితా సర్కార్ ఈ నెట్‌వర్క్‌లో భాగమని పోలీసులు అనుమానించారు. సీఎం సువేందు అధికారిపై దాడి కోసం రాజకీయ నాయకులు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్ చేసే ఎత్తుగడలు ఆమె వేస్తున్నట్లు హమీమ్ విచారణ వివరాలు, సాంకేతిక ఆధారాల ద్వారా తెలుసుకున్నారు.ఈ నేపథ్యంలో జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో అర్పితను బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫోరెన్సిక్ పరీక్ష కోసం ఆమె మొబైల్ ఫోన్, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం.



**న్యూ ఢిల్లీ :** దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం.ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు.

# 'ఫ్లాట్/ఇల్లు కొనే ముందు బిల్డర్‌ను ఈ ఒక్క ప్రశ్న తప్పక అడగండి'






**బాంబే:** కష్టపడి సంపాదించిన డబ్బుతో సొంతింటి కల నెరవేర్చుకునే క్రమంలో ఎక్కువ మంది దేనికి ప్రాధాన్యం ఇస్తారు చాలా వరకు సుందరమైన ఇంటీరియర్స్, వ్యూ, లొకేషన్, ఆకట్టుకునే రంగులు, ఆధునిక సౌకర్యాలపైనే దృష్టి పెడతారు. అయితే ఇవేమీ కుటుంబ భద్రతకు గ్యారెంటీ ఇవ్వలేవని హెచ్చరిస్తున్నారు ఐఐటీ బాంబే సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ దీపంకర్ చౌధరీ. భవనం ఎంత అంతంగా ఉన్నా, దాని పునాది బలంగా లేకపోతే అది ప్రమాదకరంగా మారొచ్చని హెచ్చరిస్తున్నారు. సొంత ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు చేసే సమయంలో బిల్డర్‌ను 'ఈ భవనం నిర్మించిన స్థలంలో మట్టి పరీక్షలు (సాయిల్ టెస్టింగ్) చేశారా? పునాది సురక్షితంగానే ఉందా?' అనే ఒక్క ప్రశ్నను బిల్డర్‌ను తప్పకుండా అడగాలని ఆయన సూచిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక నేషనల్ రీసెర్చ్ ప్రొఫెసర్‌షిప్‌కు (జేసీ బోస్ ఫెలోషిప్) ఐఐటీ బాంబే నుంచి నలుగురు ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. అందులోనే ఒకరైన దీపంకర్ చౌధరీ ఈ సందర్భంగా భవనాల భద్రత, పునాది ప్రాముఖ్యతపై ఈటీవీ భారత్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. భవనాల నిర్మాణంలో పాటించాల్సిన సాంకేతిక సూత్రాలు, మనం చేస్తున్న పొరపాట్లను విశ్లేషించారు. ఎర్త్ క్వేక్ ఇంజినీరింగ్ (భూకంప ఇంజినీరింగ్), జియోటెక్నికల్ ఇంజినీరింగ్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు ప్రొ. దీపంకర్ చౌధరీ. ఈ క్రమంలోనే ఇటీవల దేశంలోని గొప్ప రీసెర్చ్ అవార్డుల్లో ఒకటైన ఈ జేసీ బోస్ ఫెలోషిప్‌కు సెలక్ట్ అయ్యారు.అసలైన ప్రాణం పునాదిలోనే'చాలా మంది భవనం పైకి కనిపించే తీరు, గోడలు, పిల్లర్లు లేదా పైకప్పు మాత్రమే ముఖ్యం అనుకుంటారు. కానీ ఒక నిర్మాణానికి అసలైన ప్రాణం దాని పునాదిలోనే ఉంటుంది. పునాది డిజైన్ సరిగ్గా ఉంటేనే ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు లేదా ఎంతటి బరువును అయినా తట్టుకొని ఆ భవనం శతాబ్దాల పాటు సురక్షితంగా నిలబడుతుంది.' అని దీపంకర్ స్పష్టం చేశారు.ఆయన ప్రయాణం 2000లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో (××ూ౨) పీహెచ్‌డీతో ప్రారంభమైంది. రెండున్నరేళ్లలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన 2002లో ఐఐటీ కాన్పూర్‌లో అధ్యాపకుడిగా చేరారు. 2003లో ఐఐటీ బాంబేలో చేరి గత 23 ఏళ్లుగా జియోటెక్నికల్, భూకంప ఇంజినీరింగ్, ఫౌండేషన్ ఇంజినీరింగ్, సాయిల్ డైనమిక్స్, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో పరిశోధనలు నిర్వహిస్తున్నారు. పరిశోధనలతో పాటుగా దేశంలోని కీలక విద్యా బాధ్యతల్ని కూడా నిర్వహించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ 2015 జాతీయ ఉపాధ్యక్షుడిగా, గేట్- 2021 నేషనల్ ఆర్గనైజింగ్ ఛైర్మన్‌గా సేవలందించారు.అటల్ సేతు, అణు విద్యుత్ ప్రాజెక్టుల్లో కీ రోల్‌దేశంలోనే అతిపెద్ద సముద్ర వంతెన అయిన 'ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్ (అటల్ సేతు)' పునాది నిర్మాణంలోనూ దీపంకర్ కీలక పాత్ర పోషించారు. సముద్రపు అడుగున ఉండే మట్టి స్వభావం, భూకంపాల తీవ్రతను శాస్త్రీయంగా విశ్లేషించి వంతెన పునాదులు కదిలిపోకుండా ఎల్అండ్‌టీ రూపొందించారు. ఇంకా హరియాణాలోని గోరఖ్‌పూర్ అణు విద్యుత్ ప్రాజెక్ట్ కోసం మన దేశంలోనే తొలిసారిగా 'కంబైన్డ్ పైల్ అప్ ఫౌండేషన్ (జ౨ాఫీ)' అనే అడ్వాన్స్డ్ టెక్నాలజీని ఉపయోగించారు. దిల్లీ మెట్రో పనుల సమయంలో కుతుబ్ మినార్ వంటి చారిత్రక కట్టడాలకు ఎలాంటి హాని జరగకుండా భూగర్భ సొరంగాల రూపకల్పనకు దిశానిర్దేశం చేశారు.

# బాధితుడి పాత్ర పోషించడంలో మోదీ ఆనందం పొందుతున్నారు



**న్యూ ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఇటీవల యువతకు క్షమించే సంస్కృతి, దారి తప్పిన వారిని సరైన మార్గంలో నడిపించాలని ప్రధాని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ స్పందించారు. నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం, రామ మందిర్ ట్రస్ట్ విరాళాల వ్యవహారం, 2016 నోట్ల రద్దు వంటి అంశాల్లో దేశ ప్రజలకు ప్రధానమంత్రి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తాను బాధితుడిననే భావనను సృష్టించుకునే ప్రయత్నం చేస్తున్నారని, రాజకీయ ప్రత్యర్థులపై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు."తాను జీవసంబంధం లేని ప్రధానినని స్వయంగా ప్రకటించుకున్న మోదీ, బాధితుడి పాత్ర పోషించడంలో ఆనందం పొందుతున్నారు. తన పూర్వ ప్రధానులు, రాజకీయ ప్రత్యర్థులను అప్రతిష్ఠపాలు చేయడానికి తరచూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. కేవలం బహిరంగ సభల్లోనే కాదు, పార్లమెంట్‌లో కూడా అదే ధోరణి కొనసాగిస్తున్నారు. అలాగే అసభ్యకర వ్యాఖ్యలు చేసే ట్రోల్స్‌కు ప్రోత్సాహం, రక్షణ కల్పిస్తున్నారు"- జైరాం రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడునీట్ వివాదంపై కాంగ్రెస్‌నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహణలో జరిగిన నీట్-యూజీ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారాన్ని ప్రస్తావించిన జైరాం రమేశ్ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం బాధ్యత వహించలేదని విమర్శించారు. నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసుల చర్యలు కూడా ఆందోళనకరమని పేర్కొన్నారు. "పేపర్ లీకులతో లక్షలాది మంది యువత మానసిక వేదనకు గురయ్యారు. నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన చర్యలకు కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఈ వ్యవహారాలపై ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మేము కోరుతున్నాం" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.రామ మందిర్ విరాళాల అంశంపైనా విమర్శలుఅయోధ్య రామ మందిర్ ట్రస్ట్‌కు సంబంధించిన విరాళాల వ్యవహారాన్ని కూడా కాంగ్రెస్ ప్రస్తావించింది. ఈ అంశంలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తాయని, అందుకే ప్రధానమంత్రి స్పందించాలని జైరాం రమేశ్ అన్నారు. "2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో ప్రధానమంత్రి ప్రకటించిన రామ మందిర్ ట్రస్ట్‌కు సంబంధించిన విరాళాల వ్యవహారంపై కూడా దేశ ప్రజలు సమాధానం కోరుతున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.ట్రోల్స్ వ్యవహారంపై చిదంబరం ప్రశ్నసోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసే ట్రోల్స్ వ్యవహారాన్ని కూడా కాంగ్రెస్ ప్రస్తావించింది. మాజీ కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం ఎక్స్‌లో చేసిన పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించే పోస్టులపై దూషణాత్మక వ్యాఖ్యలు చేసే బీజేపీ ట్రోల్స్‌ను కూడా ప్రధానమంత్రి క్షమించారా అని ప్రశ్నించారు. ప్రజా చర్చల స్థాయిని దిగజార్చే విధంగా సోషల్ మీడియాలో జరుగుతున్న దూషణలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు ప్రధాని మోదీ మాత్రం విభేదాలు ఉన్నా సంభాషణలో సంస్కారం ఉండాలని, ద్వేషపూరిత భాషకు సమాజంలో స్థానం లేదని పునరుద్ఘాటించారు.

# రీల్స్‌లోనే క్షమిస్తారా.. కేసులూ ఎత్తేస్తారా.





**న్యూ ఢిల్లీ :** విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారుఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారుఈ వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?" అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారకాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది .తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# పాక్ యుద్ధాన్ని ఆపింది నేనే.. ట్రంప్ నోట అదే మాట

**అమెరికా:** భారత్ పాక్ యుద్ధాన్ని తాను ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పుకున్నారు. సుంకాలతో బెదిరించి యుద్ధాన్ని ఆపేలా చేశానని చెప్పారు. తాజా పత్రికా సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తొలుత రష్యా ఉక్రెయిన్ యుద్ధం గురించి ట్రంప్ ప్రస్తావించారు. యుద్ధం ముగించేలా డీల్ కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికే తాను అనేక యుద్ధాలను ఆపానని చెప్పారు. అనంతరం భారత్-పాక్ యుద్ధం గురించి ప్రస్తావించారు.'భారత్-పాక్ యుద్ధానికి మేమే ఫుల్ స్టాప్ పెట్టాము. ఆ సమయంలో 11 యుద్ధ విమానాలు కూలిపోయాయి. యుద్ధం భీకరంగా ఉంది. వెంటనే నేను సుంకాల అంశాన్ని తెరపైకి తెచ్చా.. మీరు యుద్ధం చేస్తే 250 శాతం సుంకం విధిస్తానని అన్నాను. దీంతో, వాళ్లు గోల గోల చేశారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుసటి రోజు మళ్లీ నాకు ఫోన్ చేసి యుద్ధం చేయమని చెప్పారు' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. యుద్ధం అడ్డుకుని 50 మిలియన్ల మంది ప్రాణాలు కాపాడారని పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ తనను ప్రశంసించారని ట్రంప్ చెప్పుకొచ్చారు.ట్రంప్ గతంలో కూడా ఇలాంటి ప్రకటనలే చేశారు. అనేక సందర్భాల్లో భారత్ ఈ వాదనలను తోసిపుచ్చింది. పాక్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ద్వైపాక్షిక అంశమని తేల్చి చెప్పింది. మరో దేశం జోక్యం లేనేలేదని స్పష్టం చేసింది. పలు ఫైటర్ జెట్స్ కూలిపోయాయన్న ట్రంప్ ప్రకటనను కూడా భారత్ గతంలోనే తోసిపుచ్చింది.

# జమ్మూకశ్మీర్‌లో మరో ఉగ్రదాడి- ఇద్దరు వలస కార్మికులు మృతి



**జమ్మూకశ్మీర్:** జమ్మూకశ్మీర్‌లో కుల్గామ్ జిల్లాలోని కేలం ప్రాంతంలో ఉన్న ఓ ఇటుక బట్టీ వద్ద శుక్రవారం రాత్రి దుండగులు జరిపిన కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఉగ్రవాదులు కార్మికులను లక్ష్యంగా చేసుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. పని ముగించుకుని ఉన్న కార్మికులపై దుండగులు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో తీవ్ర కలకలం రేగింది. గాయపడిన ఇద్దరినీ ఆసుపత్రులకు తరలించినప్పటికీ చికిత్స పొందుతూ మరణించారు. ఇటీవల అనంతనాగ్‌లో ఓ పోలీసు అధికారిపై జరిగిన ఉగ్రదాడి తర్వాత కేవలం పది రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం భద్రతా పరిస్థితులపై ఆందోళన వ్యక్తం అవుతోంది.అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, కుల్గామ్ జిల్లా కేలం ప్రాంతంలోని ఇటుక బట్టీ వద్ద శుక్రవారం రాత్రి ఉగ్రవాదులు కార్మికులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 20 ఏళ్ల దీపక్ రత్రే తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించేలోపే మరణించాడు. మరో కార్మికుడు బోపిందర్‌ను తొలుత అనంతనాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో సౌరాలోని ఎస్‌కేఐఎంఎస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడూ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఈ దాడిలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. ఘటన అనంతరం భద్రతా బలగాలు వెంటనే అప్రమత్తమై ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనాస్థలంలో ఆధారాలను సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దాడి వెనుక ఉన్న ఉగ్రవాద సంస్థ, దాడి ఉద్దేశంపై విచారణ కొనసాగుతోంది.కుల్గామ్ ఘటనపై జమ్మూ-కశ్మీర్ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ తీవ్రంగా స్పందించారు. అమాయక కార్మికులను లక్ష్యంగా చేసుకోవడం మానవత్వంపై దాడి అని ఆయన అన్నారు. ఇది పిరికిపంద చర్య అని, జమ్మూ-కశ్మీర్‌లో శాంతిభద్రతలను దెబ్బతీయాలనే కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన కార్మికుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాలని కూడా పిలుపునిచ్చారు.